సాక్షి నంద్యాల

బుధవారం, 9, ఏప్రిల్, 2025



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలో వెలసిన శనగల బసవన్న, శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.



ఈ ఎంపీపీ మాకొద్దు..

పాములపాడు ఎంపీపీ తొగురు సరోజినీ వర్గీనియపై ఎంపీటీసీ సభ్యులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. మంగళవారం నిర్వహించిన మండల మీట్‌కు మూకుమ్మడిగా గైర్హాజరయ్యారు. 8లో▸



టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో

కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని టీబీ డ్యామ్‌కు మూడు నెలల తర్వాత ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం ఎగువ భాగంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో 5,215 క్యూసెక్కుల నీరు చేరింది. 8లో▸

న్యూస్‌రీల్

మాజీ సీఎం జగన్ పర్యటనపై 'డ్రోన్' నిఘా



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

ప్యాపిలి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు ఉమ్మడి కర్నూలు జిల్లా సరిహద్దు ప్రాంతమైన పోతుదొడ్డి వద్దకు చేరుకున్నారు. జగన్ పర్యటనకు జిల్లా నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తారనే అనుమానంతో పోలీసులు ఇక్కడికి చేరుకున్నట్లు సమాచారం. డ్రోన్ కెమెరా ద్వారా పరిస్థితిని సమీక్షించిన అనంతరం ఎస్పీ ప్యాపిలి, డోన్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలపై స్థానిక అధికారులతో ఆరా తీశారు.

13న గురుకులాల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో(2025-26) 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 13న పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకులాల సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలోని 8, నంద్యాల జిల్లాలోని 6 పరీక్షా కేంద్రాల్లో 5వ తరగతిలో 1,120 సీట్లకు 9,340 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,480 సీట్లకు 7,727 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. డోన్‌లోని బాలుర పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసుకున్న విద్యార్థులు సమీపంలోని బాలికల పాఠశాలలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు http://apgpcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

నకిలీ నోట్లు ఇస్తామని చెప్పి టోకరా

బొమ్మలసత్రం: అసలు నోటుకు నాలుగింతలు నకిలీ నోట్లు ఇస్తామని చెప్పి మోసం చేసిన సంఘటన నంద్యాలలో చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన బాధితుడి ఫిర్యాదుతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందిన ఆంజనేయులు, శివప్రసాద్, వెంకటశివ నాగ ప్రసాద్‌లు తమ వద్ద రూ.5 లక్షలు నకిలీ నోట్లు ఉన్నాయని తమకు కేవలం రూ.50 వేలు ఇస్తే చాలని పట్టణంలో పలువురుని ఆశ్రయించారు. ఈ క్రమంలో నందమూరినగర్‌కు చెందిన సత్యరాజు వారి బుట్టలో పడ్డాడు. ఈ మేరకు ఆదివారం రూ. 50 వేలు తీసుకుని స్థానిక అయ్యలూరిమెట్ట సమీపంలో ఓ చోటుకు చేరుకున్నాడు. కాగా నకిలీ నోట్లు ఇవ్వకుండా సత్యరాజుపై దాడి చేసి రూ. 50 వేలతో నిందితులు పరారయ్యారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విషమించిన ఎరువులు!

- మళ్లీ పెరిగిన రసాయన ఎరువుల వినియోగం
- రైతులకు భారంగా మారిన పెట్టుబడి వ్యయం
- ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు అరకొరే!
- గాడి తప్పిన గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానం
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం



అవుకు సమీపంలో వరి పైరులో రసాయన ఎరువు చల్లుతున్న రైతులు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువుల వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయనే విషయాన్ని చాలా మంది రైతులు గుర్తించలేకపోతున్నారు. వివిధ పంటల్లో ఉత్పాదకతను పెంచుకునేందుకు విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో భూమి స్వభావం దెబ్బతింటోంది. చాలా చోట్ల పొలాలు చౌడుబారుతున్నాయి. పర్యావరణం కూడా కలుషితం అవుతోంది. పంట ఉత్పత్తుల్లో కెమికల్స్ అవశేషాలు ఉండటంతో మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 2023-24లో 2,04,318 టన్నుల రసాయన ఎరువులు వాడగా.. 2024-25లో 2,34,144 టన్నులు వినియోగించారు. మొత్తం 29,826 టన్నుల వినియోగం పెరిగింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. రైతులకు అవగాహన కల్పించడం.. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచడం... తదితర విషయాలపై దృష్టిసారించడం లేదు.

ఎకరాకు 185 కిలోల రసాయన ఎరువులు

రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 96 వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. పత్తి కూడా జిల్లాలో అత్యధికంగా సాగు అవుతోంది. 2024 ఖరీఫ్‌లో 10,55,517 ఎకరాలు, రబీలో 2,14,692 ఎకరాలు ప్రకారం మొత్తంగా 12,70,209 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. నీటిపారుదల కింద సాగు చేసే పంటలకు విపరీతంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. సగటున ఎకరాకు 160 కిలోల వరకు రసాయన ఎరువులు వాడవచ్చు. అయితే 2024-25లో ఎకరాకు సగటున 185 కిలోల రసాయన ఎరువులు వినియోగించారు. 2024-25లో భూసార పరీక్షలు పెద్ద ఎత్తున నిర్వహించి.. వాటి ఫలితాలను రైతులకు అందజేసినప్పటికీ రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది.

ఖర్చు తడిసి మోపెడు

రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరుగుతుండటంతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. వివిధ కంపెనీలు రసాయన ఎరువుల ధరలు ఇష్టానుసారంగా పెంచుతున్నాయి.



10-26-26, 12-32-16 రసాయన ఎరువుల 50కిలోల బస్తా ధర రూ.1,720 ఉందంటే ధరలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయో తెలుస్తోంది. దీంతో రైతులకు ఖర్చు తడిసిమోపెడు అవుతోంది. మిర్చి, వరి సాగులో అడ్డగోలుగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పండించిన పంటల్లో కూడా కెమికల్స్ అవశేషాలు ఉంటున్నట్లుగా శాస్త్రీయంగా నిర్ధారణ అవుతోంది.

ఇవీ నష్టాలు..

- మిర్చి, పత్తి, వరి, మొక్కజొన్న, వివిధ కూరగాయల పంటలకు రసాయన ఎరువుల వాడకం ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ పంట ఉత్పత్తుల్లో కెమికల్స్ అవశేషాలు ఉంటున్నట్లు తెలుస్తోంది.
- కెమికల్స్‌తో పండించిన ఆహార ఉత్పత్తులు తీసుకుంటే ప్రజలు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- గతంలో పశువుల ఎరువులు వాడేవారు. అలాగే పొలాల్లో నాలుగైదు రోజుల పాటు గొర్రెల మందను ఉంచేవారు. కెమికల్స్ లేని ఆహారం తీసుకోవడంతో అప్పటి వారు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటున్నారు.
- ప్రస్తుతం పలు రసాయన ఎరువులు, మందులతో పండించిన ఆహారం తీసుకుంటుండటంతో జబ్బులు పెరిగిపోతున్నాయి.

'ప్రకృతి' సాయం కరువే!

రసాయన ఎరువుల వినియోగం లేకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తే ప్రజారోగ్యానికి పెద్దపీట వేసినట్లే. అయితే జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది. కాగితాల్లో వేలాది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం కనిపిస్తోంది. 2024-25లో 50 వేల ఎకరాలకుపైగా ప్రకృతి వ్యవసాయం చేసినట్లు లెక్కలు ఉన్నప్పటికీ వాస్తవం నామమాత్రమే. స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయం చేసేవారు జిల్లాలో 70 నుంచి 80 మంది వరకు ఉన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించకపోవడం, విరివిరిగా సాయం అందక పోవడం.. తదితర కారణాలతో చాలా మంది రైతులు ముందుకు రావడం లేదు.

గ్యాప్..తూచ్

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ (గ్యాప్) కింద ప్రతి మండలంలో పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చేసిన సిఫార్సుల మేరకే కెమికల్స్ వాడాలి. ప్రతి మండలంలోని 50 నుంచి 100 ఎకరాల వరకు 'గ్యాప్' కింద ఆహార పంటలు సాగు చేశారు. ప్రతి వారం పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తూ వచ్చినప్పటికీ రసాయన ఎరువులు వాడకం తగ్గలేదు. పలు పంటల శ్యాంపుల్స్‌లో కెమికల్స్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

దేశంలో నంద్యాల రెండో స్థానం

రసాయన ఎరువుల వినియోగంలో నంద్యాల జిల్లా రికార్డుల్లోకి ఎక్కింది. 2024-25 వ్యవసాయ సంవత్సరంలో రాష్ట్రంలోనే ఎరువుల వినియోగంలో మొదటి స్థానంలో నిలిచింది. మరో విశేషమేమిటంటే దేశంలోనే ఎరువుల వినియోగంలో నంద్యాల జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రసాయన ఎరువుల మంత్రిత్వ శాఖ మంత్రి జేపీ నడ్డా పార్లమెంటు వేదికగా ఇటీవల ప్రకటించారు. ఈ జిల్లాలో ప్రధానంగా వరి సాగు చేస్తారు. కాగా యూరియా 3 బస్తాల వేయాల్సి ఉండగా... 10 బస్తాల వరకు వినియోగించారు. రికార్డు స్థాయిలో నంద్యాల జిల్లాలో 3.75 లక్షల టన్నులు వినియోగించిట్లు సమాచారం. ఎరువులు ఈ స్థాయిలో వినియోగించారంటే ఆహార పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవచ్చు.

రసాయన ఎరువుల వినియోగం ఇలా..

సంవత్సరాల వారీగా (టన్నుల్లో)..

ఎరువు పేరు	2023–24	2024–25
యూరియా	56,468	63,178
డీఏపీ	16,130	18,081
ఎంఓపీ	1,722	2,731
కాంప్లెక్స్	1,27,452	1,47,430
ఎస్ఎస్‌పీ	2,546	2,717
కంపోస్ట్	---	4
ఎఫ్ఓఎం	---	3
మొత్తం	2,04,318	2,34,144

చర్యలు తీసుకుంటున్నాం



2024-25 సంవత్సరంలో సాగు విస్తీర్ణం పెరిగినందున రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. 2023-24 సంవత్సరంతో పోలిస్తే దాదాపు 30 వేల టన్నులు అదనంగా వినియోగించారు. కెమికల్స్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ కింద రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన కింద జిల్లాలో ఎంపికైన 19 గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గ్రామ సర్పంచులు, ఎంపీడీఓలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆదర్శ గ్రామాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, జిల్లా అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన కింద పార్లమెంటు సభ్యులు వారి పదవి కాలంలో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేసేవారన్నారు. ఇందుకు అనుబంధంగా ఈ పథకాన్ని ప్రధానంగా ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు చాగలమర్రి మండలం మద్దూరు, పెద్దబోదనం, పాణ్యం మండలం గోనవరం, కొండజూటూరు, జూపాడుబంగ్లా మండలం పి.గణపురం, నంద్యాల మండలం రాయమల్పురం, రుద్రవరం మండలం పెద్దకంబలూరు, వెలుగోడు మండలం అబ్దుల్లాపురం, గోస్పాడు మండలం సాంబవరం, పసురపాడు, బేతంచెర్ల మండలం గోర్లగుట్ట, కోవెలకుంట్ల మండలం సౌదరిదిన్నె, మహానంది మండలం తమ్మడపల్లి, మసీదుపురం, పాములపాడు మండలం వేంపెంట, మిడ్తూరు మండలం అలగనూరు, చెరుకుచెర్ల, ఆత్మకూరు మండలం వడ్లరామపురం, ఆళ్లగడ్డ మండలంలోని పాతకందూరు గ్రామాలను ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఏటా రూ. 20 లక్షలు మంజూరు చేయడంతో పాటు అదనంగా అడ్మిన్ కాస్ట్ పరంగా లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నిధులతో అధిక శాతం సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల పునః మూల్యాంకనం ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఫలితాలు https:// rayala seema university. ac. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో సెమిస్టర్‌కు సంబంధించి 1,636 మంది దరఖాస్తు చేసుకోగా 638 మంది, నాల్గవ సెమిస్టర్‌కు 1,752 మంది దరఖాస్తు చేసుకోగా 627 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

మారుమోగిన ఎర్రమల కొండలు



ఉత్సవ మూర్తులను పల్లకీలో కొండకు తీసుకెళ్తున్న భక్తులు

అవుకు: ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఉప్పలపాడు గ్రామంలో స్వామివారిని ఆలయ పూజార్లు పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పెళ్లి కుమారుడిలా ముస్తాబు చేసి గ్రామస్తులందరికీ స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం ఉత్సవమూర్తులను ఉప్పలపాడు గ్రామం నుంచి స్వామివారి సేవకులు దాదాపు 12 కిలోమీటర్లు కాలినడకన పల్లకీలో జక్కలేరు వాగు వద్ద ఉన్న కంబగిరి స్వామి ఆలయానికి చేర్చారు. కంబగిరయ్య కొండకు చేరిన ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం చైత్ర శుద్ధ ద్వాదశి సందర్భంగా స్వామివారు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అరాచక పాలనలో అభివృద్ధి ఏదీ

- పది నెలలకే కూటమి ప్రభుత్వ డొల్లతనం బయట పడింది
- ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



నెరవాడ చెన్నకేశవ స్వామి ఆలయంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

పాణ్యం: అరాచక పాలనలో ప్రతిపక్ష పార్టీ నేతలపై దౌర్జన్యాలు, దాడులు తప్ప అభివృద్ధి ఏదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నెరవాడ గ్రామంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ముందుగా చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది నెలలకే కూటమి ప్రభుత్వ డొల్లతనం బయట పడిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి కూటమి నేతల అక్రమార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. పాణ్యం నియోజకవర్గంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అక్రమ తవ్వకాలు, అధికారులపై త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో సామాన్యుడి జీవనం భారంగా మారుతోందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

గ్రామాల్లో కక్షలు పెంచుతున్నారు

ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కూటమి నాయకులు కక్షలు పెంచుతున్నారని కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఇందుకు కొందరు అధికారులు తోడయ్యారన్నారు. అధికారులు తమ పరిధి దాటి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ నేతల ఆగడాలు, దౌర్జన్యాలను ప్రోత్సహించే అధికారులను న్యాయస్థానం ఎదుట నిలబెడతామన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, మాజీ సర్పంచ్‌లు శేషిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి , వడ్డుగండ్ల రాముడు, రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, నాయకులు ఎల్లగౌడ్, సుబ్రహ్మణ్యం, ఆటో మాబు, విష్ణు తదితరులు ఉన్నారు.

మంత్రి అనుచరుడా మజాకా!

- చాబోలు గ్రామంలో 4.50 ఎకరాల సీలింగ్ ల్యాండ్ కబ్జాకు యత్నం
- ముందుగా ఎకరా స్థలంలో వెంచర్ వేసి ప్లాట్ల అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



సీలింగ్ ల్యాండ్‌లో వెంచర్లు వేసిన దృశ్యం

నంద్యాల(అర్బన్): అడిగేవారు లేరని.. అడ్డుకునేవారు రారని నంద్యాల మండల టీడీపీ నాయకులు సీలింగ్ భూములపై కన్నేశారు. నకిలీ పత్రాలతో అక్రమ లేఅవుట్ల వేసి సొమ్ము చేసుకుంటున్నారు. సీలింగ్ భూములను అమ్మడం, కొనుగోలు చేయకూడదనే నిబంధనలకు రెవెన్యూ అధికారులు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చాబోలు గ్రామం కర్నూలు – కడప జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరా రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు మాత్రమే ఉన్న భూముల విలువ జాతీయ రహదారి ఏర్పాటుతో ఎకరా రూ.5 కోట్ల రూ.7 కోట్ల వరకు చేరింది. సెంటు స్థలం కూడా పట్టణ ధరలను మించి పోవడంతో స్థలాలు, పొలాలకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో గ్రామ పరిసరాల్లోని సీలింగ్, అసైన్డ్, పోరంబోకు స్థలాలపై కూటమి నాయకుల కన్ను పడింది. అధికారంలోకి వచ్చాక ఎక్కడ కాస్త జాగా కనపడినా కబ్జా చేస్తున్నారు. రాత్రికి రాత్రే ఆక్రమించేసి అమ్మేస్తున్నారు. గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఐదు దశాబ్దాల క్రితం పలువురు రైతుల నుంచి ప్రభుత్వం సర్వే నెం.109/ఏలో 4.50 ఎకరాల భూమిని సీలింగ్ చేసింది. కాల క్రమేణ గ్రామంలోని మూడు పేద కుటుంబాలకు 2.50 ఎకరాల సీలింగ్ భూములను పంపిణీ చేసింది. మిగిలిన 2 ఎకరాల భూమిలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పేద లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించే క్రమంలో పట్టాలు ఇచ్చింది. ఊరి చివర కావడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండేందుకు స్థానికులు సుముఖత చూపలేదు. దీంతో అప్పట్లో ఇచ్చిన పట్టాలను కొంత కాలానికి రద్దు చేసింది. కాగా గ్రామ సమీపాన బైపాస్ రోడ్డు రావడం, గ్రామాభివృద్ధి జరుగుతుండటంతో 2021లో ఆ రెండు ఎకరాల భూముల్లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తూ 67 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అయితే కోర్టులో కేసు ఉండటంతో ఇళ్ల నిర్మాణం జాప్యమైంది. కొన్నాళ్ల తర్వాత లబ్ధిదారులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు సిద్ధమవుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

వివాదాల్లో నలుగుతున్న 4.50 ఎకరాల సీలింగ్ భూములపై స్థానిక టీడీపీ నాయకుడు కన్నేశాడు. మొదట కొంత భాగాన్ని ఆక్రమించుకోవాలని వేసిన స్కెచ్ పారింది. ప్రస్తుతం ఆ భూమిని సాగు చేసుకుంటున్న ముత్తయ్య కుటుంబం నుంచి కొనుగోలు చేసి ఆ పక్కనే ఉన్న జగనన్న కాలనీకి కేటాయించిన 2 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా ఎకరా భూమిలో వెంచర్ వేసి ప్లాట్లు అమ్మకానికి పెట్టాడు. స్థానిక మంత్రికి ఈ నాయకుడు ముఖ్య అనుచరుడు కావడంతో రెవెన్యూ అధికారులు సైతం అభ్యంతరాలు తెలపలేదు. సీలింగ్ భూములను అమ్మకాలు, కొనుగోలు చేసేందుకు వీలుండదని తెలిసినా ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

నోటీసులు ఇచ్చాం

డొంక, శ్మశాన, పోరంబోకు సీలింగ్ భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వదు. సీలింగ్ భూముల్లో వంశపారపర్యంగా సాగు చేసుకొని జీవించాలే తప్ప అమ్మకాలు జరపకూడదు. ఆ భూములను ఎవరూ కొనడానికి వీలు లేదు. భూముల్లో వెంచర్లు వేసిన వారికి నోటీసులు ఇచ్చాం. వారి నుంచి సమాధానం రాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, నంద్యాల రూరల్ తహసీల్దార్

ఉపయోగంలేని శనగల కొనుగోలు కేంద్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఆలస్యంగా తీసుకున్న నిర్ణయం శనగ రైతులకు ఏమాత్రం ఉపయోగపడని పరిస్థితి. 2024-25 రబీలో పండించిన శనగ పంటకు ధర లేక రైతు లు నష్టపోయారు. శనగ పంట డిసెంబర్ నుంచే మార్కెట్‌లోకి వచ్చింది. మద్దతు ధర రూ.5,650 ఉండగా.. మార్కెట్‌లో రూ.5వేల కంటే తక్కువ కు పడిపోయింది. మద్దతు ధరతో కొనుగోలు చేయడాన్ని కూటమి ప్రభు త్వం విస్మరించింది. దీంతో దళారీలకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది. రైతులు పంటను అమ్ముకున్న త ర్వాత ఆలస్యంగా మార్చి రెండో పక్షంలో శనగల కొనుగోలుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పటికే చిన్న, సన్న, మధ్యకారు రైతులు శనగలను అమ్ముకున్నారు. పెద్ద రైతులు గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తున్నా 76 టన్నులు మాత్రమే మద్దతు ధరతో కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇది కూడా దళారీల నుంచే కొనుగోలు చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో నెమలి మృతి


విద్యుత్ స్తంభంపై మృతి చెందిన నెమలి

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్ద యమ్మనూరు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో మంగళవారం జాతీయ పక్షి నెమలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు కానాల శ్రీనివాసరెడ్డి పొలంలోని విద్యుత్ స్తంభంపై విగతజీవిగా ఉన్న నెమలిని చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అటవీ శాఖ అధికారులకు తెలియజేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడే నెమలికి దహన సంస్కారాలు నిర్వహించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


మృతి చెందిన హనుమేష్

పెద్దకడబూరు: ఎల్ఎల్సీలో ఈతకు వెళ్లి మంగళవారం బాలుడు మృత్యువాతపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని చిన్న కడబూరు గ్రామానికి చెందిన హనుమంతు, నాగలక్ష్మి చిన్నకుమారుడు హనమేష్(8) పుట్టుకతో మూగ, చెవిటి. స్థానిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి కావడంతో మధ్యాహ్నం బడి వదిలిన తరువాత తోటి పిల్లలతో కలిసి సమీపంలోని ఎల్ఎల్సీకి వెళ్లాడు. ఈత రాకపోవడంతో ఒడ్డున కూర్చున్నాడు. కొంతసేపు తరువాత తోటివారితో కలిసి నీటిలో దిగాడు. కొంచెం లోపలికి పోవడంతో నీటిలో కొట్టుకుపోయాడు. గమనించిన తోటి పిల్లలు పెద్దగా అరవడంతో అక్కడ ఉన్నవారు కాలువలో దిగి వెతికినా లాభం లేకపోయింది. దాదాపు 500 మీటర్ల దూరంలో పిల్లవాడి ఆచూకీ లభించినా అప్పటికే విగతజీవిగా మారాడు. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

మూడిళ్లలో చోరీ


బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగాపడిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో రెండిళ్లతోపాటు తిరుమలనగర్‌లో మరో ఇంటిలో పట్టపగలే చోరీ జరిగింది. ఎన్జీవోస్ కాలనీకి చెందిన మహాబలేశ్వరప్ప, సుజాత దంపతులిద్దరూ ప్రయివేట్ సంస్థలో ఉద్యోగం రీత్యా ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. వారి ఇంటి తాళాలను దొంగలు పగలగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.60 వేల నగదు, ఏడు తులాల బంగారం, సెల్‌ఫోన్‌ను అపహరించారు. పక్క ఇంట్లో నివాసం ఉండే వేర్‌హౌస్‌లో పనిచేస్తున్న గోపాల్, నాగవేణి దంపతులు పనినిమిత్తం ఊరికి వెళ్లగా వారి ఇంటి తాళాలు పగలగొట్టి స్టీల్ డబ్బాలో దాచి పెట్టిన రూ.లక్ష నగదు, ఐదు గ్రాముల బంగారు ఉంగరాన్ని చోరీ చేశారు. తిరుమలనగర్‌లో నివాసం ఉండే కాత్రికి హరిశ్చంద్రారెడ్డి ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లొచ్చేలోగా 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.60 లక్షల నగదు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ఈ ఎంపీపీ మాకొద్దు

- తిరుగుబాటు జెండా ఎగురవేసిన ఎంపీటీసీలు
- సర్వసభ్య సమావేశానికి గైర్హాజర్
- భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు

ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియపై ఎంపీటీసీ సభ్యులు తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్యసమావేశానికి మూకుమ్మడిగా గైర్హాజరయ్యారు. ప్రత్యేకంగా సమావేశమై ఎంపీపీ వ్యవహారం శైలిపై తిరగబడాల్సిందేనని నిర్ణయించుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ తీరును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

– పాములపాడు


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. ఒక్కరు మినహా అందరూ వైఎస్సార్‌సీపీ నుంచే గెలుపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ, ఎంపీటీసీలు తుమ్మలూరు హాజిరాబీ, వేంపెంట నాగలక్ష్మమ్మ, యర్రగూడూరు దర్గాబాయి టీడీపీలో చేరగా బానుముక్కల ఎంపీటీసీ వెంకటేశ్వర్లు(వైస్ ఎంపీపీ) కాంగ్రెస్ పార్టీలో చేరారు. రుద్రవరం అరుణ స్వతంత్ర్య అభ్యర్థిగా గెలుపొంది టీడీపీలో చేరారు. కాగా పాములపాడు రమాదేవి, మిట్టకందాల మూర్తుజాజీ, మద్దూరు బషీరాహ్మద్, వానాల సరస్వతమ్మ, చెలిమిల్ల సురేష్, జూటూరు-1 వరలక్ష్మి(వైస్ ఎంపీపీ-2), కో ఆప్షన్ సభ్యుడు మూర్తుజావలి వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నారు.

ఎంపీపీ నిరంకుశ వైఖరీ..?

ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ తన స్వార్థం కోసం పార్టీ మారిందనే భావన అందరిలోనూ ఉన్నట్లు తెలుస్తోంది. తామంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీపీ తమ పట్లే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సభ్యుల ఆరోపణ. దీనికి తోడు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.35 లక్షలు నిధులు మంజూరు కాగా ఏ మాత్రం సమాచారమివ్వక పోగా.. ఏయే గ్రామాలకు ఎంతెంత నిధులు కేటాయిస్తున్నారో కూడా సభ్యులకు చెప్పలేదు. ఇక టీడీపీ నాయకులకు, తనకు సన్నిహితంగా ఉంటున్న సర్పంచులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అవిశ్వాసానికి సిద్ధం?

ఎంపీపీ తీరు మార్చుకోకుండా టీడీపీ నాయకుల చెప్పు చేతుల్లో ఉంటూ వారు చెప్పిన వారికే నిధులు కేటాయిస్తుంటే చూస్తూ ఊరుకోవాలా అని ఎంపీటీసీ సభ్యులందరూ సమాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ టీడీపీలో స్వార్థం కోసం చేరిన ఆమెను ఎంపీపీగా ఎందుకు కొనసాగించాలని వారిలో వారు చర్చించుకుంటున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానానికి వెళదామని కూడా ఎంపీటీసీ సభ్యులందరూ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా మండలంలో రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

సర్వసభ్య సమావేశం వాయిదా

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. అధికారులు, సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసి కోరం లేనందున సమావేశం బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ప్రకటించారు. కాగా సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరైన ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇప్పటి వరకు మండలానికి నిధులు ఎన్ని మంజూరయ్యాయని, దేనికెంత ఖర్చు చేశారని, తమకెందుకు చెప్పలేదని నిలదీశారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


మొహమ్మద్ రసూల్(ఫైల్)

వెల్దుర్తి: పూలతోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి మోటార్ ఆన్ చేసే ప్రయత్నంలో విద్యుత్ షాక్ గురై ఓ రైతు మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన సంజామల మాబాషా, గౌసియా దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తెకు వివాహం కాగా.. కుమారుడు సంజామల మొహమ్మద్ రసూల్(21) తల్లిదండ్రులతో కలిసి పొలం పనులు చేస్తున్నాడు. పుల్లగుమ్మి రోడ్డు రేగులకుంట వద్ద వారికున్న 3ఎకరాల పొలంలో కనకాంబరాల తోటకు నీళ్లు కట్టేందుకు మంగళవారం ఉదయం 6గంటలకు బయలుదేరాడు. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ స్విచ్ వేసే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే కూలబడ్డాడు. కొద్దిసేపటి తర్వాత చుట్టుపక్కల దాయాది రైతులు గమనించి విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. తండ్రి తోట వద్దకు వచ్చి హుటాహుటిన వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసుకున్నారు.

ప్రజలను మోసగించిన కూటమి నేతలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- పార్టీ శ్రేణుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కొలిమిగుండ్ల: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మాయ మాటలు చెప్పి ప్రజలు మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. మంగళవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగా మండల అధ్యక్షులు, పార్టీ నూతన మండల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కొత్తగా ఎన్నికైన అనుబంధ విభాగాల నాయకులు కష్టపడాలని సూచించారు. ప్రతి చిన్న విషయానికి పోలీస్ స్టేషన్‌లో తమ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి బీసీ ఉన్నారనే అండతో స్టేషన్‌లో పోలీసులు రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ శ్రేణుల కోసం ఏదైనా అవసరం అనుకుంటే తానే స్వయంగా స్టేషన్ ఎదుట ధర్నా చేసేందుకైనా సిద్ధమని భరోసా ఇచ్చారు. అరాచకాలు, వేధింపులకు రాబోయే రోజుల్లో వంద శాతం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

సిమెంట్ యాజమాన్యాల తీరు సరికాదు

వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని విధాలా మద్దతిచ్చి రామ్‌కో, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీల పరిశ్రమలు ఏర్పాటుకు సహకరించామని కాటసాని రామిరెడ్డి అన్నారు. అప్పట్లో పెట్నికోట సమీపంలో ఏర్పాటువుతున్న అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ సేకరణ సభకు హాజరైన బీసీ జనార్దనరెడ్డి ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నట్లు బహిరంగంగా చెప్పారన్నారు. వద్దన్న వాళ్లకే యాజమాన్యాలు పనులు కట్టబెడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులకు మొండిచేయి చూపిన తీరు సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లాయర్ మహేశ్వరరెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యువజన విభాగం నియోజవర్గ అధ్యక్షుడు పేరం నందకిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, వైస్ఎంపీపీ క్రిష్టారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలో పాముల కలకలం


చంపేసిన పాములు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీలో కల కేజీబీవీ బాలికల పాఠశాలలో మంగళవారం రెండు చిన్న సైజు పాములు బాత్రూమ్‌లో కనిపించడంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పాఠశాలలో పనిచేసే వర్కర్లు వాటిని చంపివేయడంతో విద్యార్థినులు ఊపిరి పీల్చుకున్నారు. బాత్రూమ్ పైపుల ద్వారా అవి లోపలికి ప్రవేశించి ఉంటాయని పాఠశాల సిబ్బంది తెలిపారు.

కోలుకోలేక విద్యార్థి మృతి


పులిపాటి శ్రీనాథ్(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గుడేకల్ గ్రామానికి చెందిన వీరేష్, నాగమణి దంపతుల కుమారుడు శ్రీనాథ్(13) స్థానిక జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 6న శ్రీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురికావటంతో కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక సోమవారం రాత్రి మృతిచెందాడు. వడదెబ్బ తగటంతోనే తీవ్ర అస్వస్థకు గురైనట్లు వైద్యులు తెలిపారని మృతుడి తల్లిదండ్రులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని కుమ్మరిగేరిలో గ్యాస్ లీకై సిలిండర్ పేలి షాషావలి అనే వ్యక్తి గాయపడ్డాడు. దుకాణంలో బజ్జీలు వేస్తుండగా.. గ్యాస్ లీకై మంటలు రావడంతో స్వల్ప గాయాలతో బయటకు పరుగులు తీశాడు. అనంతరం మంటలు ఎక్కువై సిలిండర్ పేలింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. మొత్తం రూ.90 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

టీబీ డ్యామ్‌కు 5,215 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- అకాల వర్షాలతో జలాశయానికి నీరు రాక
- 7.310 టీఎంసీలకు చేరిన నీటి నిల్వలు


హొస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యామ్‌లో తగ్గిన నీటిమట్టం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి (టీబీ డ్యాం) మూడు నెలల తర్వాత మంగళవారం ఇన్‌ఫ్లో మొదలై 5,215 క్యూసెక్కుల నీరు జలాశయానికి వస్తున్నాయి. ఎగువ భాగంగలో వర్షాలు తగ్గడంతో జనవరి నుంచి జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. ఆ సమయంలో 77.776 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఇన్‌ఫ్లో లేకపోవడంతో ప్రస్తుతం 7.310 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. వేసవి మొదలవడం, సాగు నీటి డిమాండ్ పెరగడంతో నీటి నిల్వల్లో నుంచి రోజుకు ఒక టీఎంసీ వరకు తగ్గుతూ వస్తోంది. కాగా డ్యాం ఎగువ భాగంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మంగళవారం 5,215 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. టీబీ బోర్డు అధికారులు ఈనెల 10న ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపేయాల్సి ఉండగా మరో రెండు వారాలు కొనసాగించే అవకాశాలున్నాయి.

ఎల్లెల్సీలో తగ్గిన నీటిమట్టం

తుంగభద్ర దిగువ(ఎల్లెల్సీ) కాలువ హొళగుంద సెక్షన్‌లో మంగళవారం దాదాపు రెండడుగుల మేర నీటి మట్టం తగ్గింది. కర్ణాటక కోటా నీరు ఈ నెల 5కే ముగియడంతో పాటు అక్కడి రైతులకు నీటి అవసరం లేకపోవడం తదితర కారణాల వల్ల టీబీ బోర్డు అధికారులు ఆంధ్ర కోటా నీరును మాత్రమే వదిలి కర్ణాటక కోటా నీటిని బంద్ చేశారు. దీంతో కాలువలో నీటిమట్టం తగ్గింది. వేసవి కావడం, టీబీ డ్యాంలో నీటి మట్టం పడిపోతుండడంతో మరికొద్ది రోజుల్లో ఎల్లెల్సీకి నీటి సరఫరాను పూర్తిగా నిలిపి వేయనున్నారు. అందులో భాగంగా ఇప్పటి నుంచే కాలువకు నీటిమట్టాన్ని తగ్గిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయిలో నీరు చేరడంతో దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద రైతులు రెండు కార్ల పంటలు పండిస్తున్నారు. ఈ నెలాఖరికి రబీ కోతలు ప్రారంభం కాన్నాయి.

టీబీ డ్యాంలో నీటి నిల్వ

టీబీ డ్యాంలో మంగళవారం ఉదయం 1,633 అడుగులకు గాను 1584.98 అడుగులతో 105.788 టీఎంసీలకు గాను 7.310 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఇన్‌ఫ్లో 5,215 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో రూపంలో 4,202 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి టీబీ డ్యాంలో 4.117 టీఎంసీలు మాత్రమే ఉండేది. ఇక ఎల్లెల్సీ పరిధిలో ఆంధ్ర కాలువ ప్రారంభం (హన్వాళ్ సెక్షన్) 250 కి.మీ వద్ద 622 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.

కార్పొరేట్ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం


2డీ ఎకో మిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను 2029 నాటికి కార్పొరేట్ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజి విభాగంలో ఏర్పాటు చేసిన నూతన 2డీ ఎకో కలర్ డాప్లర్ మిషన్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన 2డీ ఎకో మిషన్ వల్ల శిశువుల నుంచి పెద్దల వరకు గుండె సమస్యలను తెలుసుకునే వీలుందన్నారు. ఈ నెల 19న ఆరోగ్యశాఖ మంత్రి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శిస్తారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ఉన్న మిషన్ 15 సంవత్సరాల వయస్సు గల వారికి ఉపయోగపడేదని, ఈ మిషన్ నెలలోపు పిల్లలను కూడా పరీక్షించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, కార్డియాలజి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల్లో కాలుతూ.. చల్లని గాలినిస్తూ!



వర్షం పడుతుందంటారు..
పరుగుతీస్తూ నా పంచన
తలదాచుకుంటారు..
మండుతున్న ఎండలంటారు..
వెతుక్కుని మరీ నా నీడన
సేదతీరుతారు..
పిల్లలు ఏడుస్తున్నారంటారు..
నా కొమ్మలకు ఊయలకట్టి జోల
పాడతారు..
వాయు కాలుష్యంతో
ఉక్కిరిబిక్కిరవుతారు..
నా గాలి పీల్చుకొని ఊరట
పొందుతారు..
పంటి నొప్పితో బాధ పడతారు..
వేప పుల్లతో తోముకొని కుదుటపడతారు..
ఒళ్లంతా అనారోగ్యమంటారు..
లేలేత ఆకులతో నయమైందంటారు..
ఒక్కటేమిటి.. ఇలా చెప్పుకుంటూ
పోతే నాతో బోలెడు ఉపయోగాలు.
ఎన్నో ఏళ్లుగా నీడనిస్తూ, ఆరోగ్యాన్ని పంచుతున్న నన్నెందుకిలా కాల్చేస్తున్నారు.
కడుపులో అగ్గిపెట్టి నిలువునా దహించివేస్తున్నారు. మీ ఊపిరి నిలుపుతున్నందుకా? మీ ఉనికిని కాపాడుతున్నందుకా? తరతరాల నేస్తం.. కాలరాయకు పచ్చదనం.

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి వెళ్లె రహదారిలోని ఓ పంట పొలంలో వేప చెట్టు మంగళవారం అగ్నికి ఆహుతైంది. చెట్టు మొదలుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పచ్చని భారీ వృక్షం నిప్పుల్లో వణికిపోతున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను కలచివేసింది.

– బేతంచెర్ల

యువతి ఆత్మహత్య


దివ్య (ఫైల్)

కర్నూలు: నెలసరి సమయంలో వచ్చే తల నొప్పి బాధ భరించలేక కల్లూరు మండలం ముజఫర్ నగర్ శివారులోని ముదిరాజ్ నగర్‌లో నివాసముంటున్న పేరపోగు దివ్య (20) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పేరపోగు సుధాకర్, పేరపోగు ప్రభావతి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారులు సంతానం. పెద్ద కూతురు దివ్య తల్లితో పాటు కూలీ పనులకు వెళ్లేది. రెండు సంవత్సరాలుగా మైగ్రేషన్ తలనొప్పితో బాధ పడుతూ పనులకు కూడా వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ ప్రభుత్వాసుపత్రిలో మందులు తీసుకొని వాడుతుండేది. తండ్రి సుధాకర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. దివ్యకు నెలసరి సమయంలో తట్టుకోలేనంతగా తల నొప్పి వస్తుండటంతో తరచూ తల్లిదండ్రులతో చెప్పుకుని బాధ పడుతుండేది. ఈ స్థితిలో మంగళవారం ఉదయం దివ్య అమ్మమ్మ ఇంటికి వెళ్లి రేకుల షెడ్డుకు చున్నీతో ఉరి వేసుకుంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గుర్తించి ఉరి నుంచి తప్పించి ఆటోలో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం రానివ్వొద్దు

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి


ఆలూరులోని సమీకృత హాస్టల్‌లో భోజనాన్ని రుచి చూస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ఆలూరు రూరల్/దేవనకొండ: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఆలూరులోని కేజీబీవీ, గిరిజన బాలికల, బాలుర, సమీకృత హాస్టళ్లతో పాటు దేవనకొండలోని అంగన్‌వాడీ కేంద్రాలు, జెడ్పీహెచ్ మెయిన్ స్కూల్, రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. పౌష్టికాహారం పెట్టట్లేదని, తమరు వస్తున్నట్లు తెలుసుకునే కాస్త నాణ్యతతో భోజనం వండినట్లు ఆలూరు గిరిజన బాలికల పాఠశాల కమిటీ చైర్మన్ శంకర్ నాయక్ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలూరులోని 32 షాపును తనిఖీ చేశారు. స్టాకు వివరాలు తనిఖీ చేశారు. తూకాల్లో తేడాలు లేకుండా నిత్యావసర సరులకు సరఫరా చేయాలన్నారు. అంతకు ముందు మొలగవల్లి గ్రామంలో ఇంటింటి రేషన్ పంపిణీని పరిశీలించారు. తహసీల్దార్ గోవింద్ సింగ్, సీఎస్ డీటీ దీపా, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ రఘురామి రెడ్డి, ఎంఈఓ కోమలాదేవి, ఆర్ఐ బసవన్న గౌడ్, సీఐ రవిశంకర్ రెడ్డి ఆయా హాస్టళ్ల వార్డెన్లు, హెచ్ఎంలు ఉన్నారు.